ఏడాది తర్వాత మురిసిన లగచర్ల

- కేటీఆర్ రాకతో తండాలలో పండుగ వాతావరణం
- నృత్యాలు చేస్తూ ఆనందం పంచుకున్న గిరిజనులు
- కాంగ్రెస్ పాలనలో రోజూ ఆందోళనలు, అరెస్టులు
- చెల్లాచెదురైన గిరిజన ప్రజానీకం, చెమ్మగిల్లిన కండ్లు
- బీఆర్ఎస్ అండతో కోలుకుంటున్న భూబాధితులు

కోస్గి నిరసన దీక్ష వేదిక వద్దకు ర్యాలీగా వెళ్తూ ప్రజలకు అభివాదం చేస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి, చిత్రంలో అశేషంగా తరలివచ్చిన ప్రజానీకం

హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, ఫిబ్రవరి 10 (నమస్తే తెలంగాణ): ఎటు నుంచి అధికారులు వచ్చి ఎవరి పొలంలో టేపులు పట్టి కొలుస్తరో... ఏ రోజు కాంగ్రెస్ నాయకులు వచ్చి మీ భూములియ్యాల్సిందే.. ఇయ్యకుంటే గుంజుకుంటమని బెదిరిస్తరో... ఏ అర్ధమరాత్రి పోలీసులు వచ్చి తమ ఇంట్లో నిద్రపోతున్న మగవారిని చేతులు విరిచి ఈడ్చుకుపోతరో.. అడ్డుకున్న ఆడవాళ్లపై అసభ్యంగా ప్రవర్తిస్తరో.. ఇలా ఒకట్రెండు రోజులు కాదు! ఏడాది దాటిన కాంగ్రెస్ పాలనలో ఏ రోజు చూసినా సీఎం సొంత నియోజకవర్గం కొడంగల్‌లోని లగచర్ల పరిధిలోని గిరిజన తండాల్లో ఇదే పరిస్థితి. తమ భూములను కాపాడుకునేందుకు గిరిజనులు సాగించిన 'లగచర్ల లడాయి' జాతీయ స్థాయిలో సంచలనమైంది. ఒకవైపు ప్రభుత్వం వేధింపులకు గురి చేసినా... బీఆర్ఎస్ అండతో పోరాటం సాగిస్తూనే ఉన్నారు. ఈ నేపథ్యంలో నవ్వడమే మరిచిపోయిన ట్టుగా ఉన్న ఆ గిరిపుత్రులు చాలాకాలానికి సంతోషంగా గడిపారు. సోమవారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హకీంపేటకు వచ్చిన సందర్భంగా తండాల్లో పండుగ వాతావరణంలో కనిపించింది. ఈ నవ్వుల వెనుక ఏడాదిగా అనుభవించిన కష్టాలు, వాటిని అధిగమించేందుకు గిరిజనులు సాగించిన పోరాటం కండ్ల ముందు కదలాడుతాయి.

తండాలపై ఫార్మా పిడుగు

ఫార్మా కంపెనీల కోసం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కొడంగల్ నియోజకవర్గంలోని భూములను సేకరించేందుకు సిద్ధమవడంతో గ్రామాల్లో అగ్గిరాజుకుంది. ప్రధానంగా తండాల్లో ఎకరం, రెండెకరాల కొద్దిపాటి భూమి సాగుచేసుకుంటూ బ్రతుకుతున్న గిరిజనులు తమ భూములు ఇచ్చే ప్రసక్తేలేదని తేల్చిచెప్పారు. ఈ క్రమంలో ఏడాది కాలంగా లగచర్ల పరిధిలోని రోటిబండతండా, పులిచర్లకుంటతండాల్లోని వందలాది ఎకరాల భూములను కాపాడుకునేందుకు గిరిజనులు కంటి మీద కునుకు లేకుండా గడిపారు. నిత్యం తండాలకు వచ్చే అధికారులు వేధింపులకు గురిచేశారు. తాము భూములు ఇవ్వబోమంటూ హైదరాబాద్, వికారాబాద్, దుద్యాలలోని సర్కారు ఆఫీసుల చుట్టూ తిరిగారు. ఇలా ఎక్కని గడప లేదు.. దిగని గడపలేదు అన్నట్టుగా అర్జీలు పట్టుకుని తిరిగారు. కనిపించిన ప్రతీఅధికారి కాళ్లావేళ్లా పడ్డారు. అయినా ఎవరూ కనికరించలేదు. సర్కారు నిర్దాక్షిణ్యంగా భూములను లాక్కునేందుకు సిద్ధమైంది. ఈ నేపథ్యంలో రంగంలోకి దిగిన కలెక్టర్, జిల్లా అధికారులు గ్రామసభలు పెట్టి భూములు తీసుకునేందుకు ప్రయత్నాలు సాగించారు. నవంబర్ చివరివారంలో కొందరు గిరిజనులు అధికారులపై దాడి చేశారంటూ పోలీసులు కేసుపెట్టారు. ఇదే అదనుగా అర్ధరాత్రి గ్రామాలపై విరుచుకుపడ్డ వందలాది మంది పోలీసులు కరెంటు తీసి ఇండ్లలోకి చొచ్చుకెళ్లారు. నిద్రిస్తున్న ప్రతి మగవారిని రెక్కలు విరిచి ఈడ్చుకుపోయారు. ఇలా 60 మందిని పోలీస్ స్టేషన్‌కు తరలించి, 25 మందిపై కేసులు నమోదు చేసి, జైలుకు పంపారు.

దుఃఖంలో తండాలు.. దీనంగా జైలుపక్షులు

పోలీసులు గ్రామాలపై విరుచుకుపడ్డప్పుడు చిన్నాపెద్దా, ముసలీముతక చూడలేదు. దాడి జరిగిందని చెప్తున్న రోజు ఆ వ్యక్తులు ఊర్లో ఉన్నారో లేరో అని కూడా పోలీసులు అడగలేదు.... గిరిజనులు చెప్పినా పోలీసులు వినలేదు. కఠినమైన సెక్షన్లు పెట్టి అరెస్టు చేయడంతో 70 రోజుల పాటు వరకు అమాయక గిరిజనులు జైలు జీవితం గడిపారు. కొడంగల్ మాజీఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డిని కూడా పోలీసులు అరెస్టు చేశారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కూడా కేసులో ఇరికించేందుకు ప్రయత్నించారు. ప్రభుత్వం, పోలీసులు ఎన్ని ప్రయత్నాలు చేసినా గిరిజనులు పోరాటం ఆపలేదు. బీఆర్ఎస్ అండతో వీరోచితంగా ధైర్యసాహసాలు ప్రదర్శించారు. జైలుపాలైన తమ వారిని రక్షించుకునేందుకు గిరిజన మహిళలు చేసిన ఉద్యమం స్ఫూర్తిదాయకంగా నిలిచింది. ఆందోళనల నుంచి న్యాయపోరాటం వరకు, కొడంగల్‌లో సాగుతున్న అకృత్యాలను ఢిల్లీ స్థాయిలో ఎండగట్టడం వరకు బీఆర్ఎస్ వెన్నంటి నిలిచింది. జాతీయ స్థాయిలో ఎస్సీ, ఎస్టీ కమిషన్, మహిళా కమిషన్ దృష్టికి తీసుకెళ్లింది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సహా ముఖ్యనేతలు, మహిళానేతలు ప్రత్యక్షంగా ఉద్యమంలో భాగస్వాములయ్యారు. పోరాటం ఫలించి రైతులంతా జైలు నుంచి బెయిల్‌పై బయటకొచ్చారు.

రామన్న రాకతో తండాల్లో పండుగ

ఇలా 2024 జనవరిలో మొదలైన భూపోరాటం కొనసాగుతూనే ఉంది. తండాల్లోని పండుగ పబ్బం లేకుండా పోయింది. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం భూసేకరణకు సర్వే చేస్తున్నా గిరిజనులను వేధింపులకు గురిచేసేందుకు సాహసించడంలేదు. కొన్నిరోజులుగా గిరిజనులంతా కాస్త కుదుటపడి, తిరిగి వ్యవసాయం చేసుకుంటున్నారు. ఈ క్రమంలో సోమవారం కోస్గిలో రైతు దీక్ష సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సుంకిమెట్లతో పాటు హకీంపేటకు కూడా వెళ్లారు. కేటీఆర్ వస్తున్నారని రెండు తండాలకు చెందిన గిరిజనులు హకీంపేటకు వచ్చి, ఘనస్వాగతం పలికారు. ఏడాదిగా ఆ ప్రాంతంలో ఇంత సందడి నెలకొనడం ఇదే మొదటిసారి అని స్థానికులు ఆనందభాష్పాలతో చెప్పారు. ముఖ్యంగా గిరిజన మహిళలు తమ సంప్రదాయ నృత్యాలతో ఆడి, పాడి సందడి చేయడంతో లగచర్ల పరిధిలో పండుగ వాతావరణం కనిపించింది.

లోకం పోకడ

ఈ ట్రంపు ఇలా దాపురించాడేమే..
మా వాడు అమెరికా నుంచి డాలర్లు పంపిస్తే
బంగారం కొనుక్కుందామనుకున్నాం ..
వాడ్ని ఇండియాకు పంపించేశాడు..
అటు డాలర్లు లేవు.. ఇటు బంగారమూ లేదు!



సీఎంపై విద్యార్థినుల ఆగ్రహజ్వాల

'మా భూముల జోలికి వస్తే సహించేది లేదు. ఎక్కడో ఉండి కాదు ఇక్కడికి వచ్చి మా మధ్యలో ఉండి భూములు కావాలని అడుగు. మేము ఇస్తామా? లేదా? తెలుస్తది. మీకు ఓట్లేసిన మా బాధలు మీకు కనిపించడం లేదా?' అంటూ రోటిబండతండాకు చెందిన విద్యార్థిని మంజుల కోస్గి రైతు నిరసన దీక్షలో సీఎం రేవంత్‌రెడ్డిని నిలదీసింది. కొడంగల్ భూముల్లో తొండలు గుడ్లు కూడా పెడతలేవు అంటూ కామెంట్ చేసిన రేవంత్ గురించి ఈ ఆవేశంగా మాట్లాడింది. 'ఓట్లేయని వాళ్లొచ్చి మాకు సపోర్ట్ ఇచ్చి మాట్లాడుతున్నారు. నీవు ఎక్కడున్నావ్ సార్' అంటూ గట్టిగా నిలదీసింది. మా బాధలు కనిపించడం లేదా? ఏడుస్తూ చెప్పే మాటలు వినబడడం లేదా? మీరు కేసులు వేసినందుకు మా నాన్న ఎక్కడికో పోరిపోయి అడుక్కొని తిన్నాడు. ఇంతకన్నా దౌర్భాగ్యం మరోటి ఉంటుందా? అని తండాల బాధను వెళ్లగక్కింది.

చీఫ్ మినిస్టర్ కాదు.. చీప్ మినిస్టర్

'రేవంత్‌రెడ్డి సార్ ప్రజల బాధలు మీకు కనిపిస్తున్నాయా? మీరు చీఫ్ మినిస్టర్ కాదు.. చీప్ మినిస్టర్‌లా అబద్ధాలకోరు' అని రోటిబండ తండాకు మరో విద్యార్థిని పూజ ఆగ్రహం వెళ్లగక్కింది. 'నీ మాటలన్నీ అబద్ధాలే.. మమ్మల్ని పెయిడ్ బ్యాచ్ అని అంటావా. మాకెవరూ డబ్బులియ్యలేదు. మా కష్టం బాధను తెలుసుకున్న మా అన్న కేటీఆర్.. మమ్మల్ని ఆదుకున్నాడు' అంటూ చెప్పింది. 'మా పేరెంట్స్ బాధల్ని మేము కండ్లారా చూసినం. మా బాధలు చూసి మాకు సాయం చేసిన కేటీఆర్ హెల్పింగ్ నేచర్ చూసి మాట్లాడుతున్నాం. రేవంత్ సార్ మీకే ఓట్లేసినం.. మీరెప్పుడైనా మా బాధలు గమనించారా?' అని పూజ తన గుండెలోతుల్లోంచి బాధను వ్యక్తంచేసింది.

కొడంగల్‌ను అవమానిస్తున్న రేవంత్ : నిరంజన్‌రెడ్డి

రాజకీయ భిక్షను ప్రసాదించిన కొడంగల్‌ను సీఎం రేవంత్‌రెడ్డి అవమానిస్తున్నారని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి విమర్శించారు. తొండలు గుడ్లుపెట్టని భూములు అంటూ ఈ రైతులను, గిరిజనులను అవమానించడం సరికాదని రైతు నిరసన దీక్షలో మండిపడ్డారు. మార్పు మార్పు అని ప్రజలను ఏమార్చారని ధ్వజమెత్తారు. కేసీఆర్ హయాంలో పదేండ్లలో ఏటా అద్భుతరీతిలో వ్యవసాయాన్ని తీర్చిదిద్దుకున్నామని చెప్పారు. రైతంటే చెమట చుక్కకు ప్రతిరూపం అన్నట్టు కేసీఆర్ గౌరవించారని తెలిపారు. కష్టానికి విలువ తెచ్చిన, భూమికి విలువలు పెంచిన నాయకుడు కేసీఆర్ అని పేర్కొన్నారు. పంటలను పెంచి, అదే పంటలను సకాలంలో కొని రైతులకు మేలు చేసిన నాయకుడని చెప్పారు.

రేవంత్‌పై నమ్మకం పోయింది: పట్నం నరేందర్‌రెడ్డి

రేవంత్ సర్కారుపై ప్రజలకు పూర్తిగా నమ్మకం పోయిందని మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి తెలిపారు. కోస్గి రైతు నిరసన దీక్షలో ఆయన మాట్లాడారు. ఎట్ల గెలిపించుకున్నామో, అట్లనే ఓడగొడతామని ఈ ప్రాంత రైతులు అంటున్నారని చెప్పారు. జనవరి 26న కోస్గి గడ్డపై రైతుబంధు ఇస్తానని, ఆత్మీయ భరోసా ఇస్తానని, ఇందిరమ్మ ఇండ్లు కట్టిస్తామని, రేషన్ కార్డులు ఇస్తామని, పథకాలు అమలు చేసి ఇస్తామన్న సీఎం రేవంత్ రెడ్డి.. ఇప్పటికీ ఇవ్వకుండా మోసం చేశారని ధ్వజమెత్తారు. త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో రేవంత్‌కు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కంపెనీలను పెడతామంటే లగచర్ల రైతులు సీఎం రేవంత్‌కు తగిన బుద్ధి చెప్పారని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలోనే కొడంగల్ నియోజకవర్గంలో అభివృద్ధి జరిగిందని.. దీనిపై దమ్ముంటే చర్చకు రావాలని సవాల్ విసిరారు.

కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో విసుగు: రాజేందర్‌రెడ్డి

కాంగ్రెస్ పాలనపై ప్రజలు విసుగు చెందారని నారాయణపేట మాజీ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి తెలిపారు. కోస్గి రైతు నిరసన దీక్షలో ఆయన మాట్లాడారు. దామరగిద్ద మండలంలో సబ్‌స్టేషన్ పేరుతో అక్కడి భూములు లాక్కుంటున్నారని ధ్వజమెత్తారు. ఇది ప్రజాపాలన కాదని, ప్రజలను హింసించే పాలన అని విమర్శించారు.

సౌందరరాజన్, రంగరాజన్‌తో మాట్లాడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు సబితాఇంద్రారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, బీఆర్ఎస్‌నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

రంగరాజన్‌పై దాడి దుర్మార్గం

- ఇది రాజ్యాంగంపై జరిగిన దాడి
- నిందితులను కఠినంగా శిక్షించాలి
- శాంతిభద్రతల పరిరక్షణలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

మొయినాబాద్, ఫిబ్రవరి10 : ధర్మరక్షణ కోసం పని చేస్తున్న చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధాన అర్చకుడు రంగరాజన్‌పై దాడి దుర్మార్గమైన చర్య అని, ఇది రాజ్యాంగంపై జరిగిన దాడిగానే భావిస్తున్నామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. సోమవారం మాజీ మంత్రులు సబితారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, బీఆర్ఎస్ రాష్ట్ర యువనాయకుడు కార్తిక్‌రెడ్డితో కలిసి రంగరాజన్‌ను కేటీఆర్ పరామర్శించారు. ఆలయ మేనేజింగ్ కమిటీ చైర్మన్ సౌందరరాజన్‌ను కలిసి యోగక్షేమాలు తెలుసుకున్నారు. తర్వాత దాడి గురించి రంగరాజన్‌తో మాట్లాడారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ రంగరాజన్‌పై దాడి ఎవరు చేసినా ఏ పేరిట చేసినా ఏ ఎజెండాతో చేసినా శాంతి భద్రతల విషయంలో ఉక్కుపాదంతో వ్యవహరించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉన్నదని చెప్పారు.

ఇది హేయమైన చర్య : ఆర్ఎస్‌పీ

భారత రాజ్యాంగం ప్రకారం ధర్మ ప్రచారం చేస్తున్న చిలుకూరు బాలాజీ ఆలయ అర్చకుడు రంగరాజన్‌పై అల్లరి మూకలు దాడి చేయడం హేయమైన చర్య అని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. రాజ్యాంగ విలువలకు బీఆర్ఎస్ కట్టుబడి ఉన్నదని, ధర్మంపై దాడి చేస్తే రాజ్యాంగ రక్షకులు అడ్డుకుని తీరుతారని చెప్పారు. ఇది పూర్తిగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వైఫల్యం వల్లే జరిగిందని విమర్శించారు. అల్లరి మూకలు ఎవరి ధైర్యం చూసుకొని రంగరాజన్‌పై దాడి చేశారని నిలదీశారు. శాంతి భద్రతలను నియంత్రించడంలో అనర్హుడైన రేవంత్‌రెడ్డి హోంశాఖకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

రంగరాజన్‌కు సీఎం రేవంత్ రెడ్డి ఫోన్

హైదరాబాద్, ఫిబ్రవరి 10 (నమస్తే తెలంగాణ): చిలుకూరు ఆలయ ప్రధాన అర్చకులు రంగరాజన్‌ను సీఎం రేవంత్ రెడ్డి ఫోన్‌లో పరామర్శించారు. రంగరాజన్ వద్దకు వెళ్లిన ఎమ్మెల్యే కాలే యాదయ్య రేవంత్‌కు ఫోన్ చేసి మాట్లాడించారు. ఇలాంటి దాడులను సహించేది లేదని రేవంత్ తేల్చిచెప్పారు. సీఎం ఆదేశాలతో దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ రంగరాజన్‌ను పరామర్శించారు.

దాడి హేయం: మాజీ ఎంపీ వినోద్‌కుమార్

రంగరాజన్‌పై దాడి హేయమని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ ఖండించారు. రాష్ట్రంలో రోజురోజుకూ శాంతిభద్రతలు క్షీణిస్తున్నాయని ఒక ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేశారు. రంగన్‌రాజన్‌పై దాడిని యావత్‌బ్రాహ్మణ సమాజంపై దాడిగా భావిస్తున్నామని బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ మాజీ అధ్యక్షుడు రమణాచారి పేర్కొన్నారు. దుండగుల దాడి అనాగరికచర్యగా ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ అభివర్ణించారు.

దాడిని ఖండించిన ప్రముఖులు

రంగరాజన్‌పై దాడిని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ఆర్ఎస్ఎస్ రాష్ట్ర ప్రాంత ప్రచార ప్రముఖ్ రాజుగోపాల్,

ఐదుగురి అరెస్ట్

చిలుకూరు బాలాజీ ప్రధాన అర్చకులు రంగరాజన్‌పై దాడి చేసిన వారిలో మరో ఐదుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇప్పటికే ప్రధాన నిందితుడు వీరరాఘవరెడ్డిని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు.

సీఎం ఇలాకాలో రైతు నిరసన దీక్ష సక్సెస్

- కోస్గిలో బీఆర్ఎస్ సభ విజయవంతం
- వేలాదిగా తరలివచ్చిన అన్నదాతలు
- గులాబీ శ్రేణుల్లో నూతనోత్సాహం

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 10 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)/మద్దూరు: సీఎం రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గంలో గులాబీ దళం కదం తొక్కింది. కాంగ్రెస్ హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ రైతు నిరసన దీక్ష కనీవినీ ఎరుగని రీతిలో విజయవంతమైంది. రైతు నిరసన దీక్షను భగ్నం చేయాలని కాంగ్రెస్ నాయకులు పన్నిన కుట్రలను ఛేదించుకుంటూ భారీఎత్తున రైతులు తరలివచ్చారు. కేటీఆర్ సభకు వెళ్లొద్దంటూ చాలా గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు పార్టీలతో సంబంధం లేకుండా కార్యకర్తలకు విందు భోజనాలు ఏర్పాటు చేశారు. చికెన్, మటన్ బిర్యానీలు పెట్టినా అక్కడ తిని కేటీఆర్ సభకు వెళ్లడంతో కంగుతిన్నారు. బీఆర్ఎస్ రైతు మహాధర్నా సక్సెస్ కావడంతో కాంగ్రెస్‌లో గుబులు రేగుతున్నది. రేవంత్‌రెడ్డి, ఆయన కుటుంబ సభ్యుల అరాచకాలపై రైతు ధర్నాలో కేటీఆర్ దుమ్మెత్తిపోశారు. కేటీఆర్ ప్రసంగిస్తున్నంత సేపు జనం కదలక పోవడం గమనార్హం. మధ్యాహ్నం ఒంటిగంటకు రైతుదీక్ష ప్రారంభమవుతుందని చెప్పినప్పటికీ 12 గంటలకే రైతులు, మహిళలు పెద్దఎత్తున సభా ప్రాంగణానికి తరలివచ్చారు. కేటీఆర్ రాక కోసం కోస్గి శివారులో వేలాదిమంది రైతులు ఎదురు చూశారు. మధ్యాహ్నం 3 గంటలకు కేటీఆర్ లగచర్ల రైతులకు హకీంపేటలో సంఘీభావం ప్రకటించారు. అక్కడి నుంచి మొదలైన ర్యాలీ సభావేదికకు వచ్చేందుకు 45 నిమిషాలు పట్టింది. ఎక్కడ చూసినా జనమే జనం. రైతులు కేటీఆర్‌కు ఘన స్వాగతం పలికేందుకు పోటీపడ్డారు. దారి పొడవునా పూలు చల్లుతూ తమ అభిమానాన్ని చాటుకున్నారు.

లగచర్లలోని పంట పొలాలను పరిశీలిస్తున్న కేటీఆర్, పట్నం నరేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, సబితాఇంద్రారెడ్డి, సత్యవతి రాథోడ్, బీఆర్ఎస్ నేతలు

తెలంగాణ ఉద్యమకారుడికి కుటుంబానికి ఆర్థికసాయం

ఇటీవల మృతిచెందిన తెలంగాణ ఉద్యమకారుడు బొంరాస్‌పేట మండలానికి మోనాచారి కుటుంబ సభ్యులను కేటీఆర్ స్వయంగా కలసి పరామర్శించారు. ఈ సందర్భంగా వారికి రూ.50 వేల ఆర్థికసాయాన్ని అందజేసి, కుటుంబానికి అండగా నిలుస్తామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, డాక్టర్ లక్ష్మారెడ్డి. మహమూద్ అలీ, సత్యవతి రాథోడ్, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు పట్నం నరేందర్‌రెడ్డి, ఆల వెంకటేశ్వరరెడ్డి, బాల్క సుమన్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ కార్యకర్తల కుటుంబాలకు పరిహారం

హైదరాబాద్, ఫిబ్రవరి 10 (నమస్తేతెలంగాణ): ప్రమాదాల్లో మరణించిన 8 మంది బీఆర్ఎస్ కార్యకర్తలకు రూ. 2 లక్షల చొప్పున పరిహారం మంజూరైంది. ఈ సందర్భంగా సోమవారం తెలంగాణ భవన్‌లో మంజూరు పత్రాలను బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జనరల్ సెక్రటరీ భరత్‌కుమార్, లీగల్‌సెల్ బాధ్యులు కల్యాణ్‌రావు, హరీశ్, వేణుగోపాల్‌రావు, రవీనా పాల్గొన్నారు.